# 'ఆడపిల్ల పగవాడికైనా వద్దు'

సాధారణముగా భరించుకొనలేని బాధా ఇబ్బందీ దేనివల్లనైనా మనకు కలిగితే 'ఈబాధ శత్రువుకైనా వద్దు పగవాడికయినా వద్దు' అనుకుంటాము. మనము అనుకొనే ఆ బాధ ఎంత దుర్భరమైనది కాకపోతే మనకు శత్రువుమీద కూడా జాలీ కనికరమూ కలుగుతాయి? ఇటువంటి భరించరాని బాధలక్రింద జమకట్టబడినవాటిలో ఆడపిల్లకు పెళ్లిచేయటమునేది ఒకటిగా చేర్చబడ్డది.

అల్లారుముద్దుగా పెంచిన అమ్మాయికి-ప్రయాసతో వెతికి అనువైన సంబంధము తెచ్చి ముచ్చటగా కట్నకానుకలతో మూడుముళ్లూ వేయించటమూ సారె తీసుకొని అమ్మాయి అత్తవారింటికి వెళ్ళటమూ బాధాకరమా? అందులోనూ 'శత్రువుకైనా వద్దని' అనుకునేటంత బాధాకరమా అని నిజము విచారిస్తే, ఇందులో బాధపడవలసిన అవసరము కనబడదు. వివాహము వధూవరులకూ వధూవరుల పక్షములవారికీ శుభప్రదమైనదిగానూ ఆహ్లాదకరమైనదిగానూ ఉండవలసిన ఘట్టము. ప్రతి శుభలేఖపైనా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణమును గురించిగాని, సీతారాముల వివాహమును గురించిగాని శ్లోకములను ఉదహరిస్తారు. అంటే, జరుగబోవు ఈ వివాహము పైన ఉదహరింపబడిన పుణ్యదంపతుల వివాహములవలె శుభప్రదమైనదీ ఆహ్లాదకరమైనదీ నన్న భావమూ ఆశయమూను మనవాళ్ళది. పుణ్యదంపతుల వివాహాలు జరిగినప్పుడు ఋషులు వేదాలనూ మంగళశ్లోకాలనూ వల్లించేవారు; ప్రకృతి చిగిర్చి రామణీయకముగా చూపట్టేది; దేవదుందుభులు మ్రోగేవి; మూడులోకాలవారూ సంతోషించేవారు అని చెప్పబడింది. ఆ వివాహాలను ఒరవడిగా పెట్టుకొని జరుపబడుతున్న నేటి వివాహాలు అంత ఆనందదాయకముగానూ, శుభప్రదముగానూ ఉన్నాయా అంటే, మనము తల తడిమిచూసుకొని పెదవి విరువవలసినదే!

మరి దీనికి కారణమేమిటి? దీనిలో మనసును బాధించే విషయమేదైనా ఉన్నదా అంటే - జరుగుతున్నది శుభప్రదమైన వివాహము-జరిపించేవారు వధూవరుల తలిదండ్రులు. కాలిడబోయేది ప్రణయైక దంపతుల వైవాహిక జీవితము. చవిచూడబోయేది ప్రణయరుచులు. కనబోయేది వంశవర్ధనులను. స్వీకరించబోయేది ఆశ్రమములలోకెల్ల మేటియయిన గృహస్థాశ్రమము!

పోనీ మరెవరైనా ఈ సందర్భములో ప్రముఖపాత్ర ధరిస్తారా అంటే వివాహకార్యములో ముఖ్యవ్యక్తులు వధువు, వరుడు, కన్య తలిదండ్రులు, వరుని తలిదండ్రులు.

తన వయోరూపలావణ్యవిద్యాసంపదలకు తగిన వరుడు లభ్యమైనాడు; అతడిని చేపట్టి తాను సంతోషముగా సుఖముగా ఇహలోకమే కాకుండా పరలోక జీవితము కూడా సార్థకము చేసుకొనవలెనని వరుని సమాగమమపేక్షించేది వధువు.

తాను మెచ్చిన వధువును సహధర్మచారిణిగా చేసుకొని, తన శుభాకాంక్షలకూ శుభాశయాలకూ మూర్తీభవించిన మనోరథముగా చేసుకొనవలెననీ, అనుర సుఖములచే ఉభయుల జీవనమును సార్థకము చేసుకొనవలెననీ, ఆమెద్వారా సత్సంతానాన్ని పొంది వంశమునూ జాతినీ పోషించవలెననీ అభిలషించేవాడు వరుడు.

తమ శక్త్యనుసారము ధనము వెచ్చించి తమ బాలికను ఒక యింటిదానిగా చేయవలెనని ఎంతటి త్యాగమైనా చెయ్యటానికి సిద్ధపడేవారు కన్య తలిదండ్రులు.

తమ కుమారుని వివాహముచేసి, పరాయిబిడ్డ అయినా న్యాయశాస్త్రరీత్యా తమకు కుమార్తె అయి, తమ వంశావళిని పెంపొందించు కులదీపిక ఈ వధువు - ఈమెను కన్నవారు తమకు ఆప్తులు అని భావించుకొనవలసినవారు వరుని తల్లిదండ్రులు.

వివాహ వైభవమునూ - వివాహ మహోత్సవమునూ కన్నులతో చూచి ఆనందించి-వధూవరులను ఆశీర్వదించటానికి గాను ఆహూతులైనవారు బంధువులు.

పాలకడలివంటి ఈ శుభసందర్భములో 'శత్రువుకైనా ఈ బాధవద్దు' అనే హాలాహలము ఎట్లా జనించింది? ఎవరిమధ్య జనించింది?

ఈ బాధ అనుభూతము! ఇది వధూవరులమధ్య ఉద్భవించదు. సామాన్యముగా కన్యాదాతకూ వరుని తలిదండ్రులకూ మధ్య వివాహ వేదికవద్ద జనించి - వరుని తండ్రి నోటివెంటగానీ, వరుని పక్షమువారి నోటివెంటగానీ మాటరూపములో వెలువడి, మరికొంతసేపటికి కలహముగా పరిణమిస్తుంది. దీని స్వభావము వరుని పక్షము వారికి దయాదాక్షిణ్యములను నశింపచేసి, మానవత్వానికి దూరముగా ఉంచి, క్రిందు మీదు తెరుగకుండా చేయటమూ; వధువు పక్షము వారిని ఆర్థికముగా నష్టపరచి, మానసికముగా బాధించి సర్వనాశనమునకు దారితీయటమూను. తత్ఫలితముగా వధువు జీవితము దుఃఖభాజనము చేయగలిగినది బాధ. ఈ బాధ మన సంఘములో సముద్రఘోషవంటిదీ, నిత్యమైనదీ, సత్యమైనదీ, అందరికీ అనుభవైకవేద్యమైనదిను!

మన సంఘములో ప్రతి మానవుడి అనుభవములోనూ ఉన్న ఈబాధ ప్రకృతిసిద్ధమా, దైవికమా? అంటే రెండూ కాదు! ఇది కేవలము సామాజికము, సాంఘికము!

వధూవరుల తల్లిదండ్రులు ఉభయకుటుంబాల గౌరవప్రతిపత్తిని ధనధాన్యసమృద్ధినీ పరస్పరము ఎరిగించుకొని-ఇచ్చిపుచ్చుకొనటాలను ముందుగానే నిర్ణయించుకొని శుభకార్యానికి ఉపక్రమిస్తారు.

పెండ్లిపందిరిలో-ఆత్మీయులూ, బంధువులూ, పెద్దలూ చేత అక్షతలు పట్టుకొని ఉండగా, పురోహితుడు మంత్రాలను ఉచ్చరిస్తూఉండగా, మంగళతూర్యరావాలు మ్రోగుతూఉండగా, మంగళసూత్రమును చేతపట్టుకొని, "తెరవెనుకనున్న వధువుకు ఈ సూత్రము కట్టనా వద్దా? తండ్రికోరిక సంభారమంతా సిద్ధముగా ఉన్నదా లేదా? తల్లికోరిన లాంఛనాలన్నీ జరుగుతాయా లేదా? లేక ఇంతకంటె అన్ని విషయాలలో మించిన సంబం

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

ధము ఏదైనా ఉన్నదా?' అనే జిజ్ఞాసలో సూత్రధారణకు అనుమానిస్తూ ఉంటాడు వరుడు.

'ఈ పెండ్లివల్ల వచ్చే ధనమూ కానుకలూ తన కుమార్తెల వివాహాలను చేయించగలవా? ఎన్ని వివాహాలకు సరిపడగలవు? అబ్బాయికి పోసి పెంచిన ఉగ్గుపాల ఖర్చూ-వాముపాల ఖర్చూ ఇందులో వచ్చినవో లేవో? ఇంతటితో ఈ పిల్లకు సూత్రధారణ కానివ్వవలెనా...... లేక మించిపోయినదేమీ లేదు! ఇప్పుడు పట్టు పట్టినా రెండు సంచులు రాలుతాయనట ములో సంశయము లేదు. వెర్రివానివలె ఇచ్చినంత పుచ్చుకొని - తొందరపడి మూడు ముళ్లూ వేస్తే అసమర్థుల మనిపించు కుంటామేమో?' అని డోలాందోళిత మనస్కుడై ఉంటాడు వరుని తండ్రి. అప్పటి కప్పుడు మెరపువలె కొన్ని క్రొత్త ఆలోచనలూ ఉపాయాలు తోస్తాయి. వెంటనే లేచి నిలువబడి 'ఉండరా అబ్బాయీ!' అంటూ ఒక చేత్తో వరుని వారించి కూర్చో పెట్టుతాడు.

అందరూ విస్మయపడతారు. కార్యక్రమము ఆగిపోయిన కారణము తెలియక తబ్బిబ్బయిపోతారు. 'జీవితములో రేపటి మాట ఆలోచించకుండా ఇంత వ్యయము చేసి, నా కుమార్తెను గృహిణిగా చేస్తున్నాను. నా జన్మ తరించబోతున్నది' అని ఆనందపడుతున్న కన్యాదాత అది చూసి నిర్ఘాంతబోతాడు.

వరుని పక్షమువారిపట్ల ఏ మపరాధము జరిగినదో నని 'ఏమి టేమిటి'ని అందరూ గగ్గోలుపడి లేచి పరస్పరమూ ప్రశ్నించు కొంటూ సందడి చేస్తారు.

వరుని తండ్రి ధీమాగా కూర్చుంటాడు!

వధువు తండ్రి దీనుడై చేతులు నులుపు కుంటూ నిలబడి ఉంటాడు!

సంప్రతింపులు జరపటానికీ సామరస్యము కుదర్చటానికీ పెద్దలయినవారు ఇరు పక్షాలనుండీ లేచి నిలువబడతారు.

"మీకు కట్నకానుకల విషయములో ఏమైనా సందేహము వచ్చిందా? మీరు కోరినంతా సిద్ధముగా ఉన్నది గా!" అంటారు వధువు పక్షమువారి ప్రతినిధి.

"మీరు సరిగా అర్థముచేసుకోనని విషయము అదే! ఏడాది క్రిందటే మా అబ్బాయికి ఈ కాస్త మొత్తమూ ఎవరో ఇస్తామన్నారు. అందులోనూ మీరు లాంఛనాలు కూడా ఆ మొత్తములో సరిపెట్టాలని చూస్తున్నారు. మా మాటలలోని అర్థము గ్రహించలేని వాళ్లు మీరేమి పిల్లను యిస్తారు? మేమేమి చేసుకుంటాము?" అంటాడు లౌకికుడైన వరుని ప్రతినిధి.

దానితో పేచీ ప్రారంభమవుతుంది. తూకము తప్పిన మాటలు అనేకము ఇరు పక్షాలనుండీ బయలుదేరుతాయి.

కన్యాదాత నిలువునా కూలిపోతాడు. ఇక్కడికి ఈ మొత్తమే అధికప్రయాసతో సమకూర్చినది. ఇంకా ఎక్కడినుండి తేగలడు? ఇక తనకు ఇల్లూవాకిలి మిగలట మున్నదా? మిగతా బిడ్డల ఆలోచన ఉన్నదా? లేక ఇంతటితో సన్యాసాశ్రమము స్వీకరించటమేనా?" అని నిశ్చేష్టుడైపోతాడు.

వివాహప్రయత్నానికే అంతవరకూ కొన్నివందలూ, వేలూ ఖర్చయి ఉంటాయి. బంధువులందరూ వచ్చి ఉంటారు. తప్పలు నదుకవలెనని జ్ఞాతు లెదురు చూస్తూ ఉంటారు. కుమార్తె పసుపుబట్టలతో, కాళ్ళకు పారాణి, ముఖమున కళ్యాణ సూచకమైన కుంకుమ రేఖలతో 'నాన్నా! నా గతి ఏమిటి?' అన్నట్లు దీనముగా చూస్తూ ఉంటుంది. కన్యాదాతకది విషమావస్థ! అతడు సందిగ్ధావస్థలో కొట్టుకొని పోతూ ఉంటాడు, అయినదానికి తోడు ఇంకా కొంచెము ఋణమో-పణమో తెచ్చి రెండుసంచులు కుమ్మరించి - సూత్రధారణ చేయించటమా? మర్యాదమార్గములూ దాక్షిణ్యములూ విడచి, కొడుకులను కన్న అహంకారముతో నరమాంస భక్షకులు కుపూనుకొన్న వధువు తండ్రికి తిరుగుమాట చెప్పటమా? వాళ్ళు కోరినధనము యివ్వక పోయినట్లైన సూత్రధారణ కాదు; పీటల మీది పెండ్లి తప్పిపోతుంది. అమ్మాయికి జీవితములో ఇదొక కళంకముగా నిలచి పోతుంది. ఈ విషమసంధిలో కన్యాదాత మానాభిమానాలు వదలుకొని మరో రెండు సంచులతో - దీనవదనముతో వివాహ వేదికను సమీపిస్తాడు.

మందహాసముతో వరుడు వధువు మెడలో మంగళసూత్రము కట్టుతాడు.

సూత్రధారణ అయినంతమాత్రాన వివాహము పూర్తికాదు. భోజనాల దగ్గర - కాఫీలదగ్గర - ప్రతిచిన్న విషయములోనూ మగపెండ్లివారు వధువుపైపువారిని గడగడ లాడించుకొంటారు. వియ్యపురాలికీ అడు బిడ్డలకూ అలుకలు! వారు లాంఛనాలతో శాంతిస్తారు.

వరునికి - ముందుగా మాట్లాడుకొనని లాంఛనమొకటి పెండ్లిలో నిర్ణీతమై ఉంటుంది. అది వరుని అలుక వేదిక, మధ్యాహ్నము పన్నెండుగంటల సమయములో పెద్దలూ చిన్నలూ భోజనాలకు


# నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ, శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు|| డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. & కంపెనీ. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

# మైబ్రో

గర్భాశయ రోగనివారిణి

అన్ని గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి, సత్సంతానమును కలుగజేయుటలో మా మైబ్రో మిక్కిలి ఘనతవహించినది. అన్ని షాపులలో దొరకును.

రు 2-8-0

కృష్ణా లేబరేటరి

★ బెజవాడ ★

32 సంవత్సరముల అనుభవముగల

రెడ్డి అండ్ కో., వారి (రిజిష్టర్డు)

కుష్ఠు, బొల్లి, సుఖ రోగోది చికిత్సలకు నేడే సంప్రతించండి.

నకలు మందులు చూసి మోస పోకుడు.

అన్నిభాషలలో కేటలాగు ఉచితము.

హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,

గోపాలపురం.

(తూర్పుగోదావరి)

బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం మొదలగు పట్టణములలో.



లాండ్రీ మనిషితో :—
"షర్టు ఇస్త్రీ చెయ్యటానికేం తీసుకుంటావు ? అర్జంటుగా ఫోటో తీయించుకోవాలి."
"రెండణాలు."
"అబ్బో రెండణాలే? అణా యిస్తాగానీ కుడివైపు మాత్రం ఇస్త్రీ చెయ్యి. సైడ్ పోజులో తీయించు కుంటాను."

తొందరపడుతూ ఉంటారు. విడిదిలో బంధువులమధ్య పెండ్లికొడుకు అధినేత వలె అలుక వేదిక నధిష్ఠించుతాడు. ఎంతమంది వచ్చి పిలిచినా - భోజనానికి లేచి రాడు. చివరకు కన్యాదాత యజ్ఞపశువు వలె చేతులు కట్టుకొనివచ్చి నిలబడతాడు.

ఆతని రాకను చూసి వరునిపక్షమువారు 'నీ మనసులో ఏమున్నదో చెప్పు? ఇంత ఖర్చుపెట్టిన పెద్దమనిషి ఈ కాస్తకూ వెనుక తీస్తాడా ఏం?' అని వరుని ప్రోత్సాహపరచి, రేడియో కావాలా? మోటారు సైకిలా? కారా? ఏమిటి చెప్పు?' అని పెద్దపెద్దవస్తువులను సూచిస్తారు. అందులో ఒకటి వరునిచేత అడిగిస్తారు. బిక్కచచ్చిన కన్యాదాతచుట్టూ కొందరుచేరి 'ఇంతఖర్చు కానే అయింది. ఈ కాస్తకూ వెలితిపడకండి. ఈ ఒక్కరోజూ కళ్లుమూసుకుంటే పెళ్లి అయిపోతుంది' అంటూ అతడికి మరొకమాట తోచకుండా చేస్తారు. అక్కడికి ఆ లాంఛనము *Extra* !

ఇక అప్పగింతలు. ఈ ఘట్టముకూడా తగవులమారి ఘట్టమే! పెండ్లికి వచ్చినవారందరికీ బట్టలు యిచ్చి అమ్మాయిని అప్పగించమని వరునిపక్షమువారు అంటారు. దానికి తలవొగ్గి యిచ్చినా తగవులు వస్తూనే ఉంటాయి. ఏదో కోటా సైనుబట్టలతో అప్పగించారంటూ పేచీలు పెట్టారు. ఇన్ని విధాల బట్టలతో అమ్మాయిని అప్పగించుకొన్నవారెవరూ అత్తవారింటిలో పిల్ల కష్టపడుతూ ఉంటే నోటిమాటగా అయినా క్షేమ మడగరు!

ఈ విధముగా అడుగడుగునకూ పేచీలతో పెళ్లివారు సంచరిస్తారు. మాటకుముందు 'మీ అమ్మాయిని మీ యింట్లోనే ఉంచుకోండి. మా దారిన మేము పోతాము' అంటూ బెదరిస్తారు.

వ్యయప్రయాసలకోర్చి ఇంతా పెండ్లి జరిపితే - అమ్మాయి అత్తవారింటికి వెళ్ళుతుందన్న నమ్మకము లేదు. పెళ్లి సాంప్రదాయం కత్తిమీద సాముగానే ఉంటుంది!

పిల్లకు పెళ్ళిచేయటమంటే ఇన్ని బాధలూ ఇంత యమయాతనా కన్యాదాత అనుభవించవలసి వస్తున్నది. పెండ్లిలో లగ్నమూ - స్థాలీపాకమూ - సదస్సు - నాకబలితో పాటు తగవులూ పేచీలూ కూడా ముఖ్య ఘట్టాలుగా స్థిరపడ్డవి.

పెళ్లిళ్ళల్లో జరుగుతున్న హంగామాలో ఇక్కడ వివరింపబడినది సహస్రాంశము మాత్రమే.

ఈ బాధలు ప్రతి గృహస్థునకూ అనుభవైకవేద్యమే! మరి వాటిని తొలగించే మార్గముల నన్వేషించుతున్నారా అంటే, కన్యాదాతలు తమ కుమార్తెల వివాహాలు కావటముతోటే ఒక వింతప్రకృతిలో పడి కన్యాదాతను ఏడిపించే అవకాశము తమకెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తారు!

నిజము విచారిస్తే వరుడూ వధువూ ఎవరికివారు ముఖ్యులే-అధికులే! వరునివలెనే విద్య, రూపసంపద, అభిమానసంపద కలిగినదే వధువు, పెండ్లికి వరుడెంత ముఖ్యుడో వధువంత ముఖ్యము. వైవాహిక జీవితములోనూ, కుటుంబ బాధ్యతలలోనూ, సమాజములోనూ, వరునితో సమానమైన బాధ్యత వహించకలిగినది వధువు. ఈసందర్భములో సామాజిక జీవితములో స్త్రీ వివాహమునకు కట్నకానుకలు చెల్లించుకొనవలసి వచ్చినదంటే దీని అంతర్యమేమిటి? స్త్రీ వివాహము చేసుకొనవలెనన్న ఈ పెనాల్టీ చెల్లించుకొనవలసినదేనా?

ఈ దురాచారము 'ఆర్థికమాంద్యమువలన వచ్చిన అనర్థాలలో ఒకటి' అని కొందరంటారు గాని, సామాన్యులలోకంటె ధనవంతులలోనే ఇది ఎక్కువగా కనబడుతున్నది.

ఈ దురాచార ఫలితముగా ఎంత విజ్ఞానవంతులైనా ఆడపిల్ల పుట్టినదనగానే తల్లిదండ్రులు పెండ్లిబాధలను తలచుకొని ఆర్థికపు చిక్కులను తలచుకొని వ్యసనపడతారు. అందువలన బాలుని పెంచినంత ఆహ్లాదముగానూ, సంతోషముతోనూ బాలికను పెంచరు. బాలబాలికల పెంపకములో తల్లిదండ్రులు చూపుతున్న వ్యత్యాసమూ భేదభావమూ బిడ్డలకు కూడా అబ్బి ఎక్కువ తక్కువలనే భ్రమలో పడవేస్తున్నది.

పెంపకములో వ్యత్యాసము ఉండటమువలన ఈ కాంప్లెక్సు వృద్ధిఅయి చివరకు ఆ పరిణామము వచ్చినదో, ఈ రెంటిలో దేనిఫలితము ఏదో, ఏది ముందో, చర్చించితే త్వరలో తేలేది కాదు. కాని ఫలితముమాత్రము మనజాతికి తలవంపులు తెచ్చేది!

స్త్రీ పురుషునితో సమానమని ఎంత కాలమునుండో మనవారు నినాదాలు చేస్తున్నారు. అనేక విషయాలలో నిరూపించుకుంటున్నారు. చాలామంది పురుషునితో సమానముగా ఉన్నామని గర్విస్తున్నారు. కాని ఎంతవరకూ-వివాహాలలో ధనము లేకుండా కన్య స్వీకరింపబడదో-అంతవరకూ స్త్రీ పురుష సమానత్వమునకు అర్థములేదు. విద్య నేర్చినా, ఉద్యోగాలు చేసినా-సంఘములో మాత్రము స్త్రీకి గౌరవము తక్కువని మనము తెలుసుకోటానికి వరకట్నాలే నిదర్శనము. ఈ విషయములో తగినంత కృషిచేసి తమకు సంఘములో సమానగౌరవ ప్రతిపత్తిని కలిగించుకోవటము స్త్రీల కర్తవ్యమని స్త్రీలోకానికి నా విజ్ఞప్తి.

తమతో సమానముగా చదువుకొన్న కన్యను వివాహము చేసుకొనటానికి, తాంబూలములోని దక్షిణను ఎంచుకోవటమనేది తన ఆధిక్యతకు లోపమని పురుషుడు గ్రహించవలసి యున్నది.

భారతమాత గర్భములో రత్నాలూ, జడలో కోహినూరూ వడుముచుట్టూ గంగా యమునలూ ఉన్నాయని మురుస్తూ కాలక్షేపము చేస్తున్నాము కాని కుటుంబాలను సర్వనాశనము చేసుకొని, జాతిని నిర్వీర్యము కావించి, సంఘాన్ని దేశాన్ని పతనము కావించే దురాచారాలలో మునిగి తేలటము స్వతంత్రభారత పౌరులకు అవమానకరమైన విషయమని మనము భావిస్తున్నట్లు కనబడదు. ★